# 1947 నాటికి ప్రపంచ ఆర్థిక పరిణామాలు!!

**మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఆర్థికంగా పటిష్టంగా ఉన్న బ్రిటన్... యుద్ధానంతరం సంక్షోభాన్ని చవి చూసింది. బ్రిటన్ యుద్ధ కార్యకలాపాల్లో మునిగి ఉన్న సమయంలో.. భారత్, జపాన్‌లలో పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. దాంతో యుద్ధానంతరం భారత మార్కెట్‌పై గత ఆధిపత్యాన్ని నిలుపుకోవడం బ్రిటన్‌కు కష్టతరమైంది. అంతేకాకుండా.. అంతర్జాతీయంగా జపాన్‌తో పోటీ పడలేకపోయింది. దాంతోపాటు యుద్ధ కాలంలో తన అవసరాల కోసం అమెరికా నుంచి రుణం సమీకరించుకుంది. ఆ కారణంగా బ్రిటన్‌పై విదేశీ రుణ భారం పెరిగింది. యుద్ధ సమయంలో డిమాండ్, ఉత్పత్తి, ఉద్యోగిత పెరిగింది. యుద్ధానంతరం మాత్రం ఉత్పత్తి క్షీణించి, నిరుద్యోగం అధికమైంది...!!**

బ్రిటనలో 1921లో ప్రతి ఐదుగురు కార్మికుల్లో... ఒకరు నిరుద్యోగిగా మారారు. ఇదేకాలంలో.. అనేక వ్యవసాయక దేశాలు సంక్షోభానికి గురయ్యాయి. యుద్ధానికి ముందు తూర్పు ఐరోపా ప్రపంచ మార్కెట్‌కు గోధుమలు అధికంగా సప్లయ్ చేసేది. యుద్ధకాలంలో ఈ ప్రాంతం నుంచి గోధుమల సరఫరాలో అనిశ్చితి ఏర్పడింది. కెనడా, అమెరికా, ఆస్ట్రేలియాలలో ఉత్పత్తి పెరిగింది. యుద్ధానంతరం తూర్పు ఐరోపా తిరిగి గోధుమల ఉత్పత్తిని పెంచింది. దాంతో ప్రపంచ మార్కెట్‌లో ప్రతికూల పరిస్థితులు తలెత్తాయి. గోధుమల ధరలు తగ్గడంతో గ్రామీణ ఆదాయాలు గణనీయంగా తగ్గాయి. దాంతో రైతులపై రుణ భారం పెరిగింది. 1920లలో అమెరికా ఆర్థిక వ్యవస్థ పురోగమనం మరింత వేగవంతమైంది. అధిక ఉత్పత్తి అనేది ఆ దేశ పారిశ్రామిక రంగ ప్రధాన లక్షణంగా మారింది. అమెరికాలో కార్ల ఉత్పత్తిదారుడైన 'హెన్రీఫోర్డ్'ను అధిక ఉత్పత్తి పితామహునిగా పేర్కొంటారు. ఫోర్డ్ పారిశ్రామిక కార్యకలాపాలు దేశమంతటా వ్యాపించాయి. ఇదేకాలంలో ఐరోపాలోనూ పారిశ్రామిక ఉత్పత్తి సంభవించింది. ఇది ఉత్పత్తి వ్యయాల తగ్గుదలకు తద్వారా ఇంజినీరింగ్ వస్తువుల ధరల తగ్గుదలకు కారణమైంది. అమెరికాలో కార్ల ఉత్పత్తి 1919లో 20 లక్షల నుంచి 1929లో 50 లక్షలకు పెరిగింది. హౌసింగ్, కుటుంబ వినియోగ వస్తువులపై అధిక పెట్టుబడుల కారణంగా ఉద్యోగిత పెరిగింది. దాంతోపాటు ఆదాయాలు, వినియోగ వస్తువుల డిమాండ్ హెచ్చింది. 1923లో అమెరికా.. ప్రపంచంలోనే ఎగుమతుల కేంద్రంగా, పెద్ద రుణదాతగా నిలిచింది.

## ఆర్థిక మాంద్యం – కారణాలు:

- 1929లో మొదలైన ఆర్థిక మాంద్యం.. 1930ల మధ్య వరకు కొనసాగింది. ఈ కాలంలో.. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి, ఆదాయాలు, ఉద్యోగిత, వాణిజ్య వృద్ధిలో తగ్గుదల ఏర్పడింది. మొదట వ్యవసాయ ఆధారిత ప్రాంతాలపై ఆర్థిక మాంద్యం ప్రభావం స్పష్టంగా కనిపించింది. వ్యవసాయ ధరల్లో తగ్గుదల.. పారిశ్రామిక ఉత్పత్తుల ధరల్లో తగ్గుదల కంటే అధికమైంది.

•1920లలో చాలా దేశాలు అమెరికా నుంచి భారీగా రుణాలు పొందాయి. వీటిని తమ తమ దేశాల్లో పెట్టుబడులుగా పెట్టాయి. 1928లో అమెరికా ఇచ్చిన విదేశీ రుణాలు ఒక బిలియన్ డాలర్లకు చేరాయి. రుణాల కోసం అమెరికాపై ఆధారపడిన దేశాలు సంక్షోభాన్ని చవిచూశాయి. అమెరికా రుణాల ఉపసంహరణ అనేక దేశాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఐరోపాలోని పలు బ్యాంకులు విఫలమై.. బ్రిటన్ పౌండ్ స్టెర్లింగ్ పతనమైంది. లాటిన్ అమెరికాలో వ్యవసాయ ఉత్పత్తుల, ముడిసరకుల ధరలు తగ్గాయి. ఆర్థికమాంద్యం కాలంలో అమెరికా తన ఆర్థిక వ్యవస్థను రక్షించుకోవడానికి దిగుమతి సుంకాలను రెట్టింపు చేసింది. ఇది ప్రపంచ వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం చూపింది.

•ఆర్థిక మాంద్యం కాలంలో అమెరికా సైతం ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంది. మాంద్యం కాలంలో ధరలు తగ్గుముఖం పట్టాయి. దాంతో అమెరికా స్వదేశంలోనూ రుణాలను తగ్గించింది. గతంలో ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లించమని ఆదేశించింది. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో.. పంటలను విక్రయించడం రైతులకు సాధ్యం కాలేదు. రైతు కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. వ్యాపారాలూ దెబ్బతిన్నాయి. బ్యాంకులు పెట్టుబడులను రికవరీ చేసుకోలేకపోయాయి. దాంతో 1933 నాటికి దాదాపు 4000 బ్యాంకులను మూసివేయడం జరిగింది. 1929, 1932 మధ్య కాలంలో 1,10,000 కంపెనీలు తీవ్ర నష్టాలు చవిచూశాయి.

## ఇండియా, ఆర్థిక మాంద్యం:

ప్రపంచంలో ఒక ప్రాంతంలో సంక్షోభ ప్రభావం.. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలను, సమాజాలను, ప్రజల జీవితాలను ప్రభావితం చేసింది. 19వ శతాబ్ద కాలంలో వలస ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి దేశంగా, తయారీ ఉత్పత్తుల దిగుమతి కేంద్రంగా రూపుదిద్దుకుంది. ఆర్థిక మాంద్యం భారతదేశ వాణిజ్యాన్ని దెబ్బతీసింది. 1928–34 మధ్య కాలంలో.. భారతదేశ ఎగుమతులు, దిగుమతులు సగానికి తగ్గాయి. అంతర్జాతీయంగా ధరల తగ్గుదల.. భారత్‌లో ధరలు పడిపోవడానికి కారణమైంది. 1928–34 మధ్య కాలంలో.. గోధుమ ధరలు 50 శాతం మేర తగ్గాయి. పట్టణ ప్రాంతం కంటే.. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువ ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గినప్పటికీ వలస ప్రభుత్వం తన రెవెన్యూ డిమాండ్‌ను మాత్రం తగ్గించుకోలేదు. ప్రపంచ మార్కెట్‌కు ఉత్పత్తులు ఎగుమతి చేసే రైతులు బాగా నష్టపోయారు. దేశవ్యాప్తంగా రైతులపై రుణ భారం పెరిగింది. వ్యయ అవసరాల కోసం తమ వద్ద ఉన్న పొదుపును వాడుకోవడం.. భూములను తనఖా పెట్టడం.. ఆభరణాలను అమ్ము కోవడం వంటి చర్యలు చేపట్టారు. ఆర్థిక మాంద్య కాలంలో.. భారత్ విలువైన మెటల్స్ ముఖ్యంగా బంగారం ఎగుమతి చేసే దేశంగా మారింది.'ప్రపంచ ఆర్థిక పురోగమ'నానికి భారత బంగారం ఎగుమతిదారులు దోహదపడ్డారని ప్రముఖ ఆర్థికవేత్త జె.ఎం.కీన్స్

అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాలపై ఆర్థిక మాంద్య ప్రభావం తక్కువగానే ఉంది. ధరలు తగ్గినందువల్ల స్థిర ఆదాయ వర్గాల(వేతనాలు పొందే మధ్యతరగతి ప్రజలు, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తూ తమ భూముల నుంచి కౌలు పొందే భూస్వాములు) పరిస్థితి మెరుగైంది. దిగుమతులపై పన్నుకు సంబంధించి ప్రభుత్వం పరిశ్రమలకు టారిఫ్ ప్రొటెక్షన్ ఇచ్చింది. దాంతో పారిశ్రామిక పెట్టుబడులు పెరిగాయి. మొదటి ప్రపంచ యుద్ధ కాలానికి ముందు భారతదేశ ఎగుమతుల్లో కామన్‌వెల్త్ దేశాల వాటా 54 శాతం. కాగా యుద్ధానంతరం ఆయా దేశాల వాటా తగ్గింది. 1935 నాటికి అనేక పారిశ్రామిక దేశాల్లో ఆర్థిక పురోగమనం ప్రారంభమైంది. భారతదేశం దిగుమతుల్లో బ్రిటన్ వాటా 1938-39లో 31 శాతం. కాగా 1947-48లో 30 శాతంగా ఉంది. ఇదే కాలానికి సంబంధించి అమెరికా వాటా 7 నుంచి 30 శాతానికి పెరిగింది.

## రెండో ప్రపంచ యుద్ధం:

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన రెండు దశాబ్దాలకు రెండో ప్రపంచ యుద్ధం జరిగింది. నాజీ జర్మనీ, జపాన్, ఇటలీలు ఒకవైపు.. బ్రిటన్, ఫ్రాన్స్, సోవియట్ యూనియన్, అమెరికాలు మరోవైపు నిలిచాయి. అనేక ప్రాంతాల్లో ఆరేళ్లపాటు యుద్ధం కొనసాగింది. ఈ యుద్ధ కారణంగా.. సుమారు 60 మిలియన్ల మంది అంటే.. 1939లో ప్రపంచ జనాభాలో 3 శాతం మంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మరణించారు. అనేక మిలియన్ల మంది గాయపడ్డారు. యుద్ధ సంబంధిత కారణాల వల్ల సైనికుల కంటే ఎక్కువమంది పౌరులు మరణించారు. ఐరోపా, ఆసియాలోని అనేక ప్రాంతాలు, నగరాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎంతో ఆర్థిక నష్టం సంభవించింది. పునర్నిర్మాణం దీర్ఘకాలిక సమస్యగా మారింది. యుద్ధానంతరం రెండు రకాల పరిణామాలు చోటు చేసుకున్నాయి. మొదటిది, అమెరికా ఆర్థికంగా, రాజకీయంగా, పటిష్టమైన మిలిటరీ దేశంగా అవతరించింది. రెండోది, సోవియట్ యూనియన్ పటిష్టమైన ఆర్థిక వ్యవస్థగా నిలదొక్కుకుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలు ఆర్థికమాంద్యం లో చిక్కుకోగా.. సోవియట్ యూనియన్ మాత్రం ప్రణాళికల అమలు ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తూ అగ్రరాజ్యంగా ఆవిర్భవించింది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసాక కూడా ప్రపంచంలోని అధిక భాగం ఐరోపా వలసపాలన కిందే కొనసాగడం గమనార్హం. రెండో ప్రపంచ యుద్ధానంతరం రెండు దశాబ్దాలకు ఆసియా, ఆఫ్రికాలోని పలు దేశాలు వలస పాలన నుంచి విముక్తి పొందాయి.

## బ్రెటన్ ఉడ్ సంస్థలు:

యుద్ధ కాలంనాటి ఆర్థిక అనుభవాలు.. ఆర్థికవేత్తల్లో, రాజకీయ నేతల్లో కొత్త ఆలోచనను రేకెత్తించాయి. అధిక ఉత్పత్తిపై ఆధారపడిన పారిశ్రామిక సమాజం.. అధిక వినియోగం లేకుంటే ఎక్కువ కాలం మనుగడ సాగించలేదు. అధిక వినియోగం కొన సాగాలంటే.. స్థిరమైన, అధిక ఆదాయాలు ఆర్థిక వ్యవస్థలో ఉండాలి. ఉద్యోగిత స్థిరంగా లేనట్లయితే.. ఆదాయ స్థిరత్వం సంభవించదు. ఆర్థిక వ్యవస్థలో

పూర్ణోద్యోగిత ఉన్నపుడు స్థిర ఆదాయాలు చోటు చేసుకుంటాయి. మార్కెట్ వ్యవస్థ ఒక్కటే పూర్ణోద్యోగిత కొనసాగడానికి దోహదపడదు. ధరలు, ఉత్పత్తి, ఉద్యోగితలలో ఒడిదుడుకులు నివారించడానికి ప్రభుత్వ జోక్యం అవసరం. ప్రభుత్వ జోక్యం ద్వారా మాత్రమే ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందని ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. దాంతోపాటు ప్రభుత్వానికి వస్తు, మూలధన, శ్రామికులపై నియంత్రణ ఉన్నప్పుడే.. పూర్ణోద్యోగిత లక్ష్యం నెరవేరుతుందని కూడా వారు అభిప్రాయపడ్డారు. ఆర్థిక స్థిరత్వం, పూర్ణోద్యోగిత.. యుద్ధానంతరం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ముఖ్య లక్ష్యాలుగా నిలిచాయి. యుద్ధానంతర అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను 'బ్రెటన్ ఉడ్' వ్యవస్థగా వ్యవహరిస్తారు. 1944లో అమెరికాలోని బ్రెటన్ ఉడ్ కాన్ఫరెన్స్ ఫలితంగా.. రెండు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు (ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులు) ఏర్పాటయ్యాయి. వీటిని 'బ్రెటన్ ఉడ్ కవలలు' అని అంటారు. ఈ రెండు సంస్థలు 1947 లో తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. ఈ రెండు సంస్థల ముఖ్య నిర్ణయాలను వీటో చేసే హక్కు అమెరికాకు ఉంది!!

### అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విధులు:

1. అంతర్జాతీయ ఆర్థిక సహకారాన్ని ఒక శాశ్వత సంస్థ ద్వారా ప్రోత్సహించడం.
2. వినిమయ స్థిరత్వం పెంపొందించడం.
3. అన్ని విధాలైన విదేశీ మారక ద్రవ్య నియంత్రణలను నిరుత్సాహపరచడం.
4. అంతర్జాతీయ వాణిజ్యంలో సంతులిత వృద్ధి విస్తరణను పెంపొందించడం.

### ప్రపంచ బ్యాంకు (ఐబీఆర్‌డీ) లక్ష్యాలు:

- సభ్య దేశాల్లో మూలధన పెట్టుబడులు పెంచడం ద్వారా సభ్యదేశాల పునర్నిర్మాణానికి సహాయపడటం;
- విదేశీ చెల్లింపుల శేషంలో అసమతౌల్యం నిర్మూలించడం;
- అంతర్జాతీయ పెట్టుబడుల పెంపు ద్వారా ప్రపంచ వాణిజ్య వృద్ధిని ప్రోత్సహించడం.
- తన సొంత నిధుల ద్వారా అభివృద్ధి ఉద్దేశాలకు పరపతి సౌకర్యం కల్పించడం.